ఆక్వా యూనివర్సిటీపై వదంతులు నమ్మొద్దు

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్

నరసాపురం: ఆక్వా యూనివర్సిటీపై వస్తున్న వదంతులు నమ్మొద్దని, నరసాపురంలోనే యూనివర్సిటీ ఏర్పాటు జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ చెప్పారు. సోమవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో తాత్కాలిక షిఫ్టింగ్ యూనివర్సిటీ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆర్థికపర ఇబ్బందుల వల్ల యూనివర్సిటీ నిర్మాణ పనులు పెండింగ్ పడ్డాయని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం షిఫ్టింగ్ చదువులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు మాట్లాడుతూ నరసాపురంలో ఏర్పాటు చేసే యూనివర్సిటీ దేశంలోనే అతి పెద్ద మూడవ యూనివర్సిటీ అన్నారు. భవన ఏర్పాటుకు సహకరించిన స్వర్ణాంధ్ర యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ కె.మాధవి, స్వర్ణాంధ్ర కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లేరు రైతులకు న్యాయం..
చింతలపూడి ఎత్తిపోతల పూర్తి

ఉంగుటూరు నియోజకవర్గానికి వరాలు
బంగారు కుటుంబాల చేయూతకు దిశానిర్దేశం
నల్లమాడు సభలో సిఎం చంద్రబాబు
ఐదు గంటలకుపైగా సాగిన సిఎం పర్యటన
టిడిపి శ్రేణుల ప్రత్యేక సమావేశంలో పలు సూచనలు

ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న సిఎం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఉంగుటూరు

జిల్లాలోని కొల్లేరు సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని, త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నీటిఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. డిసెంబర్ నెల పింఛన్ల పంపిణీలో భాగంగా సిఎం సోమవారం ఉంగుటూరు మండలం గోపినాథపట్నం, నల్లమాడు గ్రామాల్లో పర్యటించారు. ఉదయం 11.40 గంటలకు హెలీకాప్టర్‌లో నల్లమాడు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడ నుంచి గోపినాథపట్నం వెళ్లి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మికి రూ.పది వేలు పింఛన్ అందించారు. ఆ కుటుంబ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నల్లమాడులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ వ్యవసాయ, ఉద్యాన, మహిళా సాధికారిత, కోళ్ల పెంపకం వంటి వాటిపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఎకరా పొలంలో కొంత వరిసాగు, కొంత చేపల సాగు చేస్తూ ఎకరాకు రూ.రెండు లక్షలకుపైగా సంపాదిస్తున్న రైతును సిఎం అభినందించారు. పదెకరాల వరకూ ఈ విధంగా సాగుచేయడంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులకు సైతం పలు సూచనలు చేశారు. అక్కడకు వచ్చిన మహిళ తనకు ఇల్లు లేదని చెప్పగా ఇల్లు కట్టించాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. అనంతరం పేదల సేవలో ప్రజావేదిక సభలోకి సిఎం చేరుకున్నారు. ముందుగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇస్తున్న పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతోపాటు, వ్యవసాయం, ఉద్యాన పంటలతోపాటు జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సిఎం పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, బడేటి చంటి, చిర్రి బాలరాజు, కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి కె.శివప్రతాప్ కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వివరించిన ఎంఎల్‌ఎ, ఎంపీ, ఆప్కాబ్ ఛైర్మన్

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించి.. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలను వివరించారు. నియోజకవర్గంలో పలు సమస్యలు ఉన్నాయని, నిధులు మంజూరు చేయాలని కోరారు. నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసి 30 పడకలు ఏర్పాటు చేయాలన్నారు. నల్లజర్ల-లక్ష్మీపురం రోడ్డు తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి నేషనల్ హైవేకు, రెండు స్టేట్ రహదారులకు కనెక్టివిటీ ఇచ్చేవిధంగా కలపాలని తెలిపారు. భీమడోలు గురుకుల పాఠశాల దెబ్బతిందని, పున:నిర్మించాలని, నారాయణపురంలో జూనియర్ కాలేజీ శిథిలావస్థకు చేరిందని నిర్మించాలని, ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. చెరువులకు పోలవరం కుడి కాలువ నీటిని ఎత్తిపోతల ద్వారా నింపితే భూగర్భ జలాలు పెరిగి తాజానీటి వల్ల మత్స్య సంపద పెరుగుతుందని సిఎంకు వివరించారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ తోటపై నుంచి వెళ్లిన కరెంటు లైన్లను మార్చడానికి 20 శాతం ఖర్చు వసూలు చేస్తున్నారని, అది రైతులకు భారంగా మారిందని, రెండు, మూడు శాతం మాత్రమే వసూలు చేయాలని కోరారు. గొల్లగూడెం గ్రామాభివృద్ధికి రూ.రెండు కోట్లు ఇవ్వాలని కోరారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు, మామిడి, వరిరైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కూడా పాజిటివ్‌గా వస్తుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలని, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డును హైవేగా మార్చి అభివృద్ధి చేయాలని, ఏలూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం వచ్చే మార్చిలో ప్రారంభిస్తామన్నారు. నాయకులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సిఎం అధికారులను ఆదేశించారు. పోలవరం కుడికాలువ నీటితో చెరువులు నింపుదామని సిఎం అన్నారు.

గుడ్ల నాగలక్ష్మి కుటుంబానికి చేయూత

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మికి పింఛన్ అందించిన సిఎం కుటుంబ సమస్యలను తెలుసుకున్నారు. అప్పులు పూర్తిగా తీరుస్తామని, ఎంసిఎ చదువుకున్న కుమారునికి మంచి ఉద్యోగం, కుమార్తె వాసవి ఆపేసిన చదువును ఇంటర్, డిగ్రీ పూర్తి చేయిస్తామని, డ్రోన్ ద్వారా నెలకు రూ.25 వేలు ఆదాయం వచ్చేలా చర్యలు, ఇంటి యజమానికి ఐస్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పిస్తామని సిఎం చెప్పారు. బంగారు కుటుంబాలు సుంకర నాగమణి కుటుంబానికి మార్గదర్శి పసులేటి రామారావు, మరో బంగారు కుటుంబం జాలాది లక్ష్మికి మార్గదర్శి మనోజ్ శంకర్‌దత్తా ఆర్థికంగా చేయూతనిచ్చి ఇల్లు కట్టడం, పిల్లల చదువులు చూస్తామని చెప్పారు. మార్గదర్శకులను సిఎం సన్మానించారు.

టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం

ఉంగుటూరు నియోజకవర్గ పర్యటనలో ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సిఎం సమావేశమయ్యారు. సమావేశంలో పలు అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

కలెక్టర్.. అడ్మినిస్ట్రేషన్ ఇలాగైతే ఎలా..

నల్లమాడు గ్రామానికి సంబంధించిన జనాభాతోపాటు ఇతర వివరాలను ఉద్యాన శాఖ సచివాలయ ఉద్యోగి ప్రేమ్‌కుమార్ సిఎంకు వివరించారు. దీంతో అన్నింటిపైనా అవగాహన ఉందా, లేకపోతే నేను వస్తున్నని తెలుసుకుని చిలకపలుకులు పలుకుతున్నావా అని సిఎం అడిగారు. తెలుసని చెప్పడంతో అయితే ఎన్ని ఎకరాల సాగు భూమి ఉంది, ఏయే పంటలు పండిస్తున్నారు, రైతుల ఆదాయం పెంచేందుకు ఎటువంటి ప్రణాళికలు చేపట్టారో చెప్పాలని సిఎం అడిగారు. మొత్తం సాగుభూమి 1400 హెక్టార్ల వరకూ ఉందని ఉద్యోగి చెప్పగా, నాకు ఇచ్చిన దాంట్లో 400 హెక్టార్ల వరకూ ఉందంటూ కలెక్టర్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్లు గ్రామంలో ఎన్ని ఉన్నాయని, ఎన్ని కట్టాల్సి ఉందని అడగా సదరు ఉద్యోగి సమాధానం చెప్పలేకపోయారు. ఇంటర్‌నెట్ కనెక్షన్లపైనా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్.. అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉంటే ఎలా.. మీరు చేయాలి... ఉద్యోగులతో చేయించాలి అంటూ చురకలు అంటించారు. తాను వచ్చి రెండు నెలలు అయ్యిందని ఉద్యోగి చెప్పగా, ముందున్నవారు ప్రణాళికలు రూపొందించలేదా అంటూ ప్రశ్నించడంతో చేశారని ఉద్యోగి సమాధానమిచ్చారు. మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సోలార్ ఏర్పాటు చేయాలని, వచ్చే బడ్జెట్‌లోపు ఇవన్నీ జరగాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలని, అందరికీ శిక్షణ ఇవ్వాల్సి ఉందని సిఎం వ్యాఖ్యానించారు. గ్రామసభలు మొక్కుబడిగా కాకుండా, ఫలితాలు వచ్చేలా ఉండాలన్నారు. సభలో మైక్ పని చేయకపోవడం అందరిలోనూ తీవ్ర అసహనం రేపింది. కలెక్టర్ సైతం అక్కడి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామాజిక పెన్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం గునుపూడి 11వ వార్డులోని అరుంధతిపేటలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది ప్రతినెలా ఇంటికి వచ్చి పెన్షన్ అందిస్తున్నారా, సకాలంలో అందుతుందా, ఎంతిస్తున్నారు, ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ఆరా తీశారు. పెన్షన్ సొమ్ములో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పథకం కింద జిల్లాలో సోమవారం 2,26,995 మందికి పెన్షన్లను ఉదయం ఆరు గంటల నుండి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ ప్రారంభించామని, ఈ పింఛన్ల కింద జిల్లాకు రూ.97.29 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్-ఎస్.వేణుగోపాల్, డిపిఎం మురళీకృష్ణ, మున్సిపల్ సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, తహాశీల్దార్ రావి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి బస్టాండ్ ఆధునికీకరణ

సంక్రాంతికి అందుబాటులోకి : డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - ఉండి

ఉండి బస్టాండ్‌ను పూర్తిస్థాయి లో ఆధునికీకరించి ప్రయాణికులకు సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకొ స్తామని స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. సోమవారం ఉండి బస్టాండ్‌లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన జిల్లా కలె క్టర్ చదలవాడ నాగరాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందం ర్భంగా రఘురామకృ ష్ణరాజు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన తర్వాత బస్సుల్లో ప్రయా ణించే మహిళల సంఖ్య అధికంగా ఉందని, వారికి ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశంతో బస్టాండ్‌ను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. ఉండి బస్టాండ్ పల్లంగా ఉండటం వల్ల వర్షం వస్తే నీరు నిలబడి ప్రయా ణికులు ఇబ్బంది పడుతు న్నా రని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ ఇన్‌గేట్ నుండి అవుట్‌గేట్ వరకు రూ.25 లక్షల ఎన్ఆర్ఇ జిఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణా నికి చర్యలు తీసుకున్నా మన్నా రు. బస్టాం డ్‌కు ఆనుకుని మరుగుదొడ్ల నిర్మా ణం కూడా చేపట్టి, 15 రోజు ల్లోగా పూర్తి చేయనున్నట్లు తెలి పారు. బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ స్పీకర్ కలెక్టర్‌తో చర్చించారు. ఆర్‌టిసి ఆర్ఎం ఎన్‌విఆర్.వరప్రసాద్, భీమవరం డిపో మేనేజర్ వై.వేణు, సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, కూటమి నాయకులు కొత్తపల్లి నాగరాజు, జుత్తిగ నాగరాజు, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

చలిగాలులతో విలవిల

ప్రజాశక్తి - మొగల్తూరు

దిత్వా తుపాన్ ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చలిగాలులు వీచాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు కూడా మార్కెట్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. అత్యవసర పనులు నిమిత్తం మాత్రమే ప్రజలు బయటకు వచ్చి వెంటనే తిరిగి వెళ్లిపోయారు. దీంతో మార్కెట్‌లోని దుకాణాలు వెలవెలబోయాయి.

ఆకివీడు: మండలంలో ఆదివారం రాత్రి నుండి సోమవారం ఉదయం వరకు చిరుజల్లులు పడ్డాయి. అయితే ఈదురుగాలులు వీయడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వరి చేలు కోతకు వచ్చిన దశలో అగ్గి తెగులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

పాలకొల్లు: పాలకొల్లులో సోమవారం పగలంతా ఈదురుగాలులతో చలిగాలులు వీచాయి. తెల్లవారుజామున చిరుజల్లులు పడ్డాయి. దీంతో రోడ్లు బురదమయమయ్యాయి.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్‌లో ప్రజల నుండి అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణితోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి జి.పిచ్చయ్య, జిల్లా చేనేత శాఖాధికారి కె.అప్పారావు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం ఉండాలన్నారు. అధికారులు లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద అవగాహనా ర్యాలీని సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ప్రకాశం చౌక్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండేందుకు నిరంతరం అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో సుమారు 1,500 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. కొత్తగా వ్యాధి సోకకుండా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. కుటుంబంలో ఎయిడ్స్ సోకిన వ్యక్తికి పుట్టబోయే పిల్లలకు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులను వాడాలని, చికిత్సకు సహకరించాలని కోరారు. అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, హాస్పిటల్ పర్యవేక్షకులు లక్ష్మణ్ జీతనాంద్, ఎఆర్‌టి సెంటర్ కౌన్సిలర్ నాగరాజు, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ గోవిందబాబు, డాక్టర్ అయ్యగారి శ్రీరామ్, ప్రవీణ్, మాధవీలత శివరంజని, శ్రీనివాస్, రాంబాబు, ఫార్మాసిస్టు విష్ణు, ఎన్‌సిసి అధికారి మేజర్ కె.వీరయ్య, గోపిశెట్టి మురళీకృష్ణ, ఎఆర్‌టి సెంటర్ సిబ్బంది, డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, రోటరీ, లయన్స్, రెడ్‌క్రాస్ తదితర స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ స్టూడెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టోర్నమెట్ వాయిదా

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 2, 3, 4 తేదీల్లో వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగాల్సిన 69వ స్కూల్ గేమ్స్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ వాయిదా పడినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరావు సోమవారం తెలిపారు. అండర్-17 విభాగంలో బాలబాలికలకు నిర్వహించే ఈ టోర్నమెంట్ కంటెస్టెంట్ టీమ్ సెలక్షన్లు తుపాను కారణంగా వాయిదా పడినట్లు వారు తెలిపారు. త్వరలో ఈ టోర్నమెంట్ తేదీలు ప్రకటిస్తామన్నారు.

చదువే అన్నింటికీ మూలం

పుస్తకాలతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలి : ఎంఎల్‌సి గోపీమూర్తి



విద్యార్థులకు ప్రశ్న పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి

యలమంచిలి: విద్యార్థులు పుస్తకాలతో పాటు సమాజాన్ని, తమ ఇంటిని, పరిసరాలను, తమ తోటి వారి స్థితిగతులను అధ్యయనం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి పిలుపునిచ్చారు. తాను చదివిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్లపాలెంలో ఆయన సౌజన్యంతో యుటిఎఫ్ ముద్రించిన పదవ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాల పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడలి రాధికా రాణి అధ్యక్షత వహించారు. సభలో గోపీమూర్తి మాట్లాడుతూ.. విజ్ఞానాన్ని సముపార్జించడంతో పాటు సమాజంలోని స్థితిగతులను తోటి వారి సామాజిక ఆర్థిక పరిస్థితులను విద్యార్థి దశ నుండే అధ్యయనం చేయాలన్నారు. విద్యార్థి దశ నుండి ఈ రకమైన అధ్యయనం మన జీవిత గమనాన్ని నిర్దేశిస్తుందని తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 61 మంది విద్యార్థులకు ఈ సంవత్సరం కూడా ఈ మోడల్ ప్రశ్న పత్రాలను, పుస్తకాలను ఆయన సౌజన్యంతో అందించడం జరిగింది. గత 15 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఆయన సౌజన్యంతో పుస్తకాలను అందిస్తున్నారు. గోపీమూర్తి సహాధ్యాయులు నార్నిమెరక, గ్రామ పెద్దలు వలవల విష్ణు బాలాజీ, స్కూల్ పిఎంసి ఛైర్మన్ కట్టా కృష్ణ, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, కోశాధికారి వర్ధనపు సందీప్ కుమార్, కార్యదర్శి జెఆర్‌వి.నాగేశ్వరరావు, కె.అబ్బులు, ముద్దల బాపిరాజు, ఎం.రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు కె.కృపావరం, వలవల యజ్ఞప్రసాద్, డివివి.ఆదినారాయణ, బి.విజయ కుమారి, కె.నీరజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటానని ఎంఇఒ హామీ

ఎంపిపి చొరవతో సద్దుమణిగిన వివాదం
యుటిఎఫ్ ధర్నా వాయిదా



ఇరుపక్షాలతో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు

ప్రజాశక్తి - ఉండి

ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు చొరవతో ఎంఇఒ బొల్లిపో జ్యోతి ఎట్టకేలకు దిగొచ్చారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడతానని తెలిపారు. దీంతో ఈ నెల రెండో తేదీన చేపట్టిన ధర్నాను వాయిదా వేసినట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు వామనమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, మండల అధ్యక్షులు వామనమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారిపట్ల నిర్లక్ష్య వైఖరి లేకుండా సానుకూలంగా ఉంటానని ఎంఇఒ జ్యోతి రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. దీంతో మంగళవారం తలపెట్టిన ధర్నాను వాయిదా వేశామని ప్రకటించారు. చర్చలు సఫలం కావడానికి కృషి చేసిన ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజుకు యుటిఎఫ్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు శివరామరాజు, మండల కార్యదర్శి శ్రీనివాస్, అబ్రహం, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఒ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలి

మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం

వినతిని అందజేస్తున్న సీతారం

ఆచంట: పంచాయతీ రికార్డులను తారుమారు చేస్తున్న నర్సాపురం డిఎల్‌పిఒ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తున్న శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం ఆరోపించారు. డిఎల్‌పిఒ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తున్న శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆచంట ఎంపిడిఒ బి.కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీ సర్పంచిలపై రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి విచారణ పేరుతో సర్పంచిలు అవినీతికి పాల్పడ్డారని, అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ రికార్డులను నరసాపురం తీసుకెళ్లి ఉన్న రికార్డులు లేని విధంగా, లేని రికార్డులు ఉన్న విధంగా తయారు చేసి సర్పంచి, గ్రామ పంచాయతీ సిబ్బంది డబ్బుల కోసం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్ష్య సాధింపు చర్యల కోసమే ఇటువంటి విచారణలు చేస్తున్నారని తెలిపారు. కొడమంచిలి పంచాయతీకి సంబంధించిన రికార్డులను తీసుకెళ్లి సుమారు మూడు నెలలు డిఎల్‌పిఒ కార్యాలయంలో ఉంచుకుని, ఓచర్‌లు సైతం వాళ్ల దగ్గరే ఉంచుకున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో చేయవల్సిన విచారణ రాజకీయ ఒత్తిడితో సర్పంచిలకు కనీసం సమాచారం ఇవ్వకుండా రికార్డులను నరసాపురం తీసుకెళ్లి అక్కడ చేయడం చట్టపరంగా నేరమని ఆరోపించారు. పంచాయతీ జనరల్, 15వ ఆర్థిక సంఘం నిధులు నుండి డ్రా చేసిన ప్రతి ఖర్చును అభ్యంతరం పేరుతో రాస్తున్నారని దుయ్యబట్టారు. ఎఒ శ్రీనివాస్ రావు 2024లో నరసాపురం డివిజన్ ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒగా పనిచేసినప్పుడు డివిజన్ అన్ని పంచాయతీలు విచారణ పేరుతో మైనర్ పంచాయతీలకు రూ.50 వేలు నుండి రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.10 నుండి రూ.20 వేలు లంచం రూపంలో గ్రామ పంచాయతీ సర్పంచి దగ్గర తీసుకోవడం జరిగిందన్నారు. డిఎల్‌పిఒ పేరుతో ఎఒ అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. న్యూస్ పేపర్, టివిలకు ఇచ్చిన యాడ్‌లను సైతం కూడా అభ్యంతరం రాయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆచంట నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై పోరాటం చేస్తున్నందుకు కేవలం లేనిపోని ఆరోపణలతో రాజకీయ ఒత్తిడిలతో, విచారణ పేరుతో బ్లాక్ మెయిల్ తెరలేపారని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు ఎఒ శ్రీనివాసరావుపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పలు కంపెనీలతో ఎంఒయు

ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణరావు

తాడేపల్లిగూడెం: నిట్ విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశ్యంతో కంపెనీలు విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణరావు తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఎపి నిట్), రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆంధ్రప్రదేశ్, వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలతో సోమవారం అవగాహనా ఒప్పందాలు(ఎంఒయు) కుదుర్చుకున్నట్లు తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆంధ్ర ప్రదేశ్ డిస్టిక్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ టివి.సూర్య ప్రకాష్ రావు, డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బి.మహేందర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ నిట్ విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలని ఉద్దేశంతో కంపెనీలు, విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. సంస్థలో చదువుకుంటున్న విద్యార్థుల పరిశోధనలు, ఇంటర్న్‌షిప్, ప్రాంగణ ఎంపికలు ప్రాజెక్టుల అభివృద్ధి నిమిత్తం ఇప్పటి వరకు పలు కంపెనీలు, విద్యాసంస్థలతో కలిపి మొత్తం 35 అవగాహన ఒప్పందాలు చేసుకోగా తాజాగా చేసుకున్న మూడు ఒప్పందాలతో ఆ సంఖ్య 38కి చేరుకుందని వివరించారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎపి నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్, ఆచార్యులు డాక్టర్ వినోత్‌కుమార్ రాజా, కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ ధనుంజయరావు, డీన్ హార్టికల్చర్ డాక్టర్ ఎం.మాధవి, డీన్ పీజీ స్టూడెంట్స్ బి.ప్రసన్నకుమార్, ఎపి నిట్ డీన్‌లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ కె.హిమబిందు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్టాఫ్ హేమంత్ కుమార్, చిన్ని ప్రకాష్, పాండురంగ, శ్రీనివాస్ శిరీష, అరుణ కుమారి, గాయత్రి దేవి పాల్గొన్నారు.

రెండుకు చేరిన మృతుల సంఖ్య

స్వగ్రామాలకు మృతదేహాల తరలింపు
సందర్శించిన ఆర్‌డిఒ దాసిరాజు

యలమంచిలి: మండలానికి చెందిన పదిహేను మంది ఆదివారం తూర్పుగోదావరి జిల్లా దేవిపట్నం మండలం గొందూరు గ్రామంలో గల గండి పోసమ్మ అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకొని తిరుగు ప్రయాణంలో బోలెరో వాహనం అదుపుతప్పి తిరగబడటంతో ప్రమాదం చోటుచేసుకున్న సంగతి పాఠకులకు విధితమే. దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కండ్రేకుల నరసింహామూర్తి(40) అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి గెద్దాడ రాజేష్(35) మరణించిన నేపథ్యంలో పోస్టు మార్టం అనంతరం ఇరువురి మృతదేహాలను మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు అంబులెన్సు ద్వారా సోమవారం స్వగృహాలకు తరలించారు. ప్రభుత్వం తరుపున మృతదేహాలను ఆర్‌డిఒ దాసిరాజు సందర్శించి పూలమాలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన క్షతగాత్రులలో ముగ్గురు రాజమండ్రి గవర్నమెంట్ హాస్పిటల్‌లో, పాలకొల్లు ఆసుపత్రిలో ఐదుగురు చికిత్స పొందుతుండగా తీవ్ర గాయాలపాలైన కుంచె శ్రీను బొల్లినేని హాస్పిటల్‌లో చికిత్స జరుగుతుందని, మృతిచెందిన వారితో పాటు గాయపడిన వారికి ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అదించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట తహాశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ పాల్గొన్నారు.

అఖిల భారత సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, వాసుదేవరావు

పెనుగొండ: విశాఖపట్నంలో జరుగుతున్న అఖిలభారత సిఐటియు 18వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు తెలిపారు. సోమవారం స్థానిక త్యాగరాజు భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెనుగొండలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా మహాసభలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. 2025 డిసెంబర్ 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి పివి.ప్రతాప్ మాట్లాడుతూ 13వ మహాసభ చేసిన 12 తీర్మానాల్లో ముఖ్యమైన కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్రమబద్ధీకరించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా బరకాలు

ప్రజాశక్తి - వీరవాసరం

ధాన్యాన్ని వానలకి తడవకుండా కాపాడుకునేందుకు ఉచితంగా బరకాలు అందుబాటులో ఉన్నాయని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ సోమవారం మండలంలో పర్యటించారు. బరకాలు అవసరమైన రైతులు స్థానిక సహకార సంఘాల వద్దకు వెళ్లి తెచ్చుకోవచ్చునన్నారు. బరకాలు తెచ్చుకున్న రైతులు అవసరం తీరాక తిరిగి అప్పచెప్పాలన్నారు. దిత్వా తుపాను వల్ల మన రాష్ట్రంపై కూడా ప్రభావముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండలంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఎంఎల్ఎ పరిశీలించారు. ధాన్యాన్ని సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. దూసనపూడి, పెర్కిపాలెం, తోలేరులో పలువురు కుటుంబాలను ఎంఎల్ఎ పరామర్శించారు. ఆయన వెంట వీరవల్లి చంద్రశేఖర్, యడకరాజు చినబాబు, రైతులు ఉన్నారు.

దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడికి చెందిన మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం సంస్థ అధ్యక్షులు డాక్టర్ కర్రి మురళీశ్రీనివాస్ రెడ్డి గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, మానసిక దివ్యాంగులకు గల్లీ దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రముఖ దాత ద్వారపూడి వీరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి సాటి మనిషికి సహాయం చేయడంలో దైవత్వం ఉన్నదని, జాలి, దయ, ప్రేమ, కరుణ కలిగి తోటి వారిని ఆదుకోవడంలో మానవత్వం పరిమళిస్తుందని అన్నారు. ఎన్నో వైవిధ్యమైన సేవలు అందించినందుకు అంతటి సంస్థ అధ్యక్షులు డాక్టర్ కర్రి మురళీశ్రీనివాస్ రెడ్డి తన పుట్టినరోజు వీరి మధ్య జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో మల్లిక రెడ్డి, లక్ష్మీ ఐశ్వర్య, సాయి, కార్తికేయ రెడ్డి (బ్రదర్) ఫౌండర్ సాక రాజు, నక్కా నరేష్ కుమార్, ఎన్.రవి పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీత కిరణ్మయి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి డాక్టర్ కిరణ్మయి ఉత్తమ డాక్టర్ అవార్డును సోమవారం అందుకున్నారు. గణపవరం పిహెచ్‌సిలో రోగులకు వైద్యసేవలందించడంలో ఆమె ముందున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా భీమవరంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారి డాక్టర్ ఎం.రవికుమార్ చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరంలో అధిక శాతం స్క్రీనింగ్ చేయటం వల్ల అవార్డు వచ్చిందన్నారు.

వస్త్ర వ్యాపారి రంగనాథ్ మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరుకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి, స్థానిక శ్రీజ క్లాత్ షోరూం యజమాని పులవర్తి రంగనాథ్(54) ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రంగనాథ్ ఆకాల మృతికి స్థానిక వస్త్ర షాపుల వారు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వేంద్ర హైస్కూల్ కమిటీ ఛైర్మన్ వెంకట ఫణికుమారి

ప్రజాశక్తి - పాలకోడేరు

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్ కడలి వెంకట ఫణికుమారి అన్నారు. ఇటీవల పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తమ కుమార్తె వైష్ణవి పేరున సోమవారం ఛైర్మన్ వెంకట ఫణికుమారి, నరేష్ దంపతులు 300 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు సమస్త జీవులకు ప్రాణభిక్ష అన్నారు. సూర్యతాపము నుండి జీవులను కాపాడుతున్నాయన్నారు. మొక్కలు లేనిదే మానవజాతికి మెతుకే లేదని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన గూడ్స్: ప్రయాణికుల ఇక్కట్లు

ఆకివీడు : స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరలో నెంబర్ రైల్వే గేట్ దుంపగడప గేటు వద్ద గూడ్స్ రైలు నిలిపివేయడంతో కొద్దిసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరలో ఉన్న సామాన్ గుడి దగ్గర ఉన్న దుంపగడప వెళ్లే రోడ్డు రైల్వే గేటు వద్ద భీమవరం నుండి కైకలూరు వైపుగా వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం సాయంకాలం ఆకస్మాత్తుగా నిలిపివేసింది. అయితే ఇంజన్‌లో వచ్చిన సాంకేతిక సమస్యతో ఆకస్మాత్తుగా ఏర్పడినట్లు గేట్ మాన్ తెలిపారు. ఆమార్గం గుండా వెళ్లే వారికి గేటు క్లోజ్ చేయడంతో సిద్ధాపురం రోడ్‌లో ఉన్న గేటు దాటి, సుమారు కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించి గమ్యం చేరుకున్నారు. ప్రయాణికులు సుమారు గంటసేపు ఇబ్బంది అనంతరం గూడ్స్ రైలు ఇబ్బంది తీరింది.

వాటర్ ట్యాంకర్ బహూకరణ

ఉండి: ఉండి విశాల పరపతి సహకార సంఘం మాజీ అధ్యక్షులు ముదునూరి రామలింగరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు మహదేవపట్నం గ్రామపంచాయతీ ఉపసర్పంచి ముదునూరి సుబ్బరాజు గ్రామపంచాయతీకి 2 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకర్ బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పెనిమా నాగలక్ష్మి సుబ్బలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ శివారు ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ వాటర్ ట్యాంకర్ ఎంతో ఉపయోగపడుతుందని, సుమారు రూ.2 లక్షల విలువ కలిగిన ఈ వాటర్ ట్యాంకర్‌ను పంచాయతీకి బహూకరించడం అభినందనీయమని వారు కొనియాడారు. వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ కేసిరెడ్డి గోపాలకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.చల్లారావు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని మంత్రికి వినతి

పాలకొల్లు : పాలకొల్లు శాఖ గ్రంథాలయ స్థల సేకరణకు కృషి చేయాలంటూ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు పాలకొల్లు శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన సోమవారం వినతిపత్రం అందజేశారు. గత 50 ఏళ్లుగా శాఖ గ్రంథాలయం అద్దె భవనాల్లో ఉంటూ కార్యకలాపాలు కొనసాగిస్తుందని, పాఠకులు ముఖ్యంగా విద్యార్థులు, వయోవృద్ధులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా స్థలాన్ని కేటాయించాలంటూ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వంగా నరసింహారావు, ఉపాధ్యక్షులు పీతల ఆనంద్, కార్యదర్శి కెవి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి జి.సీతారాం పాల్గొన్నారు.

గోదావరి క్రీడా సంబరాల్లో పాల్గొనాలి : కలెక్టర్

భీమవరం : గోదావరి క్రీడా సంబరాల అంతర పోటీల్లో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఉత్సాహభరితంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శారీరక ధృఢత్వానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన డిసెంబర్ రెండో వారంలో నిర్వహించనున్న గోదావరి క్రీడా సంబరాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. క్రీడల ద్వారా ఉద్యోగుల మధ్య మంచి సత్సంబంధాలు, స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని, విజయవంతం చేయాలని కోరారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ బి.శివనారాయణ రెడ్డి, సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పూర్తికి సహకరించాలి : ఎంపిపి

పెనుమంట్ర : గ్రామ సర్పంచి, ఎంపిటిసిల పదవీ కాలం రానున్న కొన్ని నెలల్లో ముగుస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పూర్తికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని పెనుమంట్ర ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) కోరారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కూటమి, వైసిపి మధ్య విభేదాలు ఉన్నా, అధికారులు మాత్రం ఎవరి మాట వినకుండా అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, మండల ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, ఎంపిడిఒ ఎన్ఎస్.కృష్ణమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి సాయం

మొగల్తూరు : అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందిపడుతున్న వ్యక్తికి వసుధా ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆ సంస్థ సభ్యులు తెలిపారు. మండలంలోని పాతపాడు గ్రామానికి చెందిన రేవు పోతురాజు(38) కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని పోతురాజుకు సోమవారం అందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుచ్చిరాజు, కనుమూరి రామాంజనేయరాజు, కె.గున్నయ్య ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి

పలుచోట్ల అవగాహనా ర్యాలీలు

నరసాపురంలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం పిఎంపి అసోషియేషన్ గణపవరం మండల కమిటీ ఆధ్వర్యాన ఎయిడ్స్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర గౌరవ సలహాదారు ఎన్.జయసూర్య, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏడాది డిసెంబర్ ఒకటవ తేదీనాడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరిపి వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవి వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించటం వల్ల ప్రజలకు అవగాహన కలుగుతుందన్నారు. ఎయిడ్స్ వ్యాధి నాలుగు మార్గాల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. అసురక్షిత శృంగారం, అపరిశుభ్రమైన సూదులు, సిరంజిలు వాడటం వల్ల వ్యాప్తి చెందుతుందని చెప్పారు. హెచ్ఐవి ఉన్నవారు మందులు తీసుకుంటే వ్యాపించే ప్రమాదాన్ని అరికట్టవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వి.శివ శ్రీనివాస్ రావు, కోశాధికారి కోటకల అప్పారావు, ఇసి సభ్యులు మస్తాన్ వల్లి, పానకాల సత్యనారాయణ, జి.మూర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని పిహెచ్‌సి డాక్టర్ ఎం.ఓంకార్‌నాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓంకార్ నాద్ మాట్లాడుతూ రక్తపరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పరీక్షలు చేయించుకోవటం వల్ల వ్యాధిని నిర్ధారణ చేయవచ్చునని చెప్పారు. ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ర్యాలీలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, పిహెచ్‌ఎన్‌సిహెచ్.సత్యవతి, హెచ్‌వి.పద్మజ పాల్గొన్నారు.

నరసాపురం: ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. నరసాపురం ఏరియా ఆసుపత్రి నుండి బస్ స్టాండ్ వరకూ ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ కోటేశ్వరరావు, వై.సతీష్‌కుమార్, పి.నళిని, కె.వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.**పాలకొల్లు :** వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. యువతలో ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని, దానికి సంబంధించిన అపోహలను తొలగిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడారు. ర్యాలీ కళాశాల నుండి ప్రారంభమై ప్రధాన రహదారుల గుండా సాగింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.యామిని, తెలుగు విభాగాధిపతి డాక్టర్ భూసి వెంకటస్వామి, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి: హెచ్ఐవి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.లక్ష్మి సునంద అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు నివారణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి విస్తరణాధికారి కృష్ణకుమార్, పిహెచ్‌సి సిబ్బంది ఉన్నారు.

ఆకివీడు : ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ చైతన్యం కలిగి హెచ్ఐవిని అంతమొందించే దిశగా కృషిచేయాలని సిహెచ్‌సి(సూపరింటెండెంట్) అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సిహెచ్‌సిలో హెచ్ఐవి నివారణ ప్రదర్శనల కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.విక్రం, ఆదర్శ లయన్స్ క్లబ్, ఆక్వా లయన్స్ క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు కె.చంద్రశేఖర్ రావు, ఎస్ఎన్‌విజి.అనిల్ కుమార్, కె.వంశీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం రెండు లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఆసుపత్రిలోని హెచ్ఐవి రోగులకు రెండు నెలలకు సరిపడా పౌష్టికాహారం, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ముందు ప్రదర్శన చేసి కొద్దిసేపు నినాదాలు చేశారు.

మొగల్తూరు : మండలకేంద్రం మొగల్తూరులో ఎయిడ్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం అవగాహన ప్రదర్శన చేశారు. అగ్రహారంలోని పాఠశాల నుండి ప్రధాన కూడళ్ల ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ మండల అధ్యక్షురాలు యు.గీతా షారోన్ పుష్ప, ఫాస్ట్ ప్రెసిడెంట్ యు.రాంబాబు, పిహెచ్‌సి సిబ్బంది ఉన్నారు.

పోడూరు : ప్రతి ఏడాది డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ఈ వ్యాధిపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని పోడూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.సుప్రజ తెలిపారు. పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా వెంకటనారాయణ

ఇరగవరం : మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఇరగవరంలో జిఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా సోమవారం వి.వెంకట నారాయణ విధుల్లో చేరారు. వీరు గతంలో పెనుమంట్ర మండల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇరగవరంకు బదిలీ అయ్యారు.

పిజిఆర్ఎస్‌కు పలు దరఖాస్తులు

గణపవరం: ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న పిజిఆర్ఎస్‌కి ఒక దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు స్థానిక తహశీల్దార్ వైకెవి.అప్పారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉన్న సమస్యలు త్వరతగతిన పరిష్కారానికి ప్రభుత్వం పిజిఆర్ఎస్‌ని ఏర్పాటు చేసిందన్నారు. మండల ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

ఆకివీడు : సమస్యల పరిష్కార కార్యక్రమం మీకోసంలో వ్యక్తిగత సమస్యలే ఎక్కువగా దరఖాస్తు చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 8 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తమ ఇళ్లకు డ్రెయినేజీ సదుపాయం లేదని ఇద్దరు, వీధిలైట్లు లేవని మరొక ఇద్దరు, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ఇద్దరు దరఖాస్తులు చేశారు. పింఛన్లు కావాలని ఇద్దరు, ఇంటికి రహదారి మార్గం కావాలని ఒకరు, ఇంట్లో దొంగలు పడ్డారని, పోలీసులు న్యాయం చేయాలని మరొకరు దరఖాస్తు చేసుకున్నారు.

జిఎస్, డబ్ల్యుఎస్ అధికారిగా దుర్గాప్రసాద్

వీరవాసరం: గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం పర్యవేక్షణ మండల అధికారిగా పొణుకుమాటి దుర్గాప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సచివాలయాల ఉద్యోగుల పర్యవేక్షణ, సంక్షేమ పథకాలు అమలు తీరుతెన్నులు పర్యవేక్షించడం తన బాధ్యతని తెలిపారు. త్వరలోనే విధివిధానాలు ఖరారవుతాయన్నారు. దుర్గాప్రసాద్ భీమవరం వద్ద చినఅమిరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు రావడం జరిగింది. గతంలో ఈయన మండలంలోని పలు పంచాయతీలలో కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ఆచంట: పదవ తరగతి మోడల్ పేపర్లు(స్టడీ మెటీరియల్) విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. వల్లూరు, ఎంపి పాలెం జూనియర్ కాలేజీ విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పోటీ పరీక్షలు, ఐఐఐటి, జెఇఇ, ఎన్ఇఇటి పరీక్షలకు ప్రిపేర్ కావడానికి ప్రత్యేక నిపుణులతో తయారుచేయబడిన స్టడీ మెటీరియల్స్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్లు రూపొందించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎ.రామకృష్ణ, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ గెద్దాడ శ్రీనివాస్, స్కూల్ ఛైర్మన్ జాన్సన్‌కుమార్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని వెంటనే విడుదల చేయాలి

తాడేపల్లిగూడెం: 12వ పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని, జీతాలు సక్రమంగా చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ చెల్లింపు, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధనాల వెంకటరావు మాట్లాడుతూ కార్మికులకు అందవలసిన జీతభత్యాలు, డిఎ ఏరియర్స్ సకాలంలో అందక కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి బాబు మాట్లాడారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు ధనాల రాజు, సతీష్ కుమార్, ఏసమ్మ పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

భీమవరం టౌన్: భీమవరం డిఎన్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ దేవ్ ఆధ్వర్యాన అన్నాకోడేరు గ్రామంలో మిత్ర హాస్పిటల్ భీమవరం వారి సౌజన్యంతో అన్నాకోడేరు హైస్కూల్‌లో సోమవారం మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది గ్రామస్తులకు షుగరు, బిపి, రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను కళాశాల అధ్యక్షులు జివి.నరసింహారాజు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.సత్యనారాయణ రాజు, కళాశాల ఉపాధ్యక్షులు జి.పాండురంగ రాజు, పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ అభినందనలు తెలియజేశారు. హెచ్‌ఎం ఎన్ఎస్ఎస్.భగవాన్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పాల్గొన్నారు.

సరిహద్దు భద్రతా దళం సేవలు మరువలేనివి

లయన్ పేరిచర్ల మురళీకృష్ణరాజు

తాడేపల్లిగూడెం : భారత సరిహద్దు భద్రతా దళాల ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని సోమవారం లయన్ కాళ్ల గోపీకృష్ణ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్, లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రధానంగా దేశ భూ సరిహద్దులను కాపాడటం, అంతర్జాతీయ నేరాలను నిరోధించడం, దేశ అంతర్గత భద్రతకు సహాయపడటం, భూ భాగం సరిహద్దులను రక్షించడం దీని ప్రాథమిక విధి అన్నారు. అనంతరం బోర్డర్లో సేవలు అందించిన తోటి లయన్ సభ్యులను సన్మానించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు మానేపల్లి కిరణ్‌కుమార్, సిఆర్‌పిఎఫ్ మాజీ ఉద్యోగి అడ్డగర్ల సురేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం ఉండి గ్రామం ఒకటవ వార్డులో డిఆర్‌డిఎ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్, కలెక్టర్ సంయుక్తంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎప్పటిలానే ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను అధికారులు, సిబ్బంది సోమవారం వేకువజామునే ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారన్నారు. పేదల సమస్యలను అర్థం చేసుకున్న మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక పింఛన్లను రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు, ఆ తరువాత రూ.3 వేల నుంచి ఒకేసారి రూ.4 వేలకు పెంచి వారిని ఆదుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌ను రూ.2 వేలు నుంచి రూ.3 వేలకు పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. పేదల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండేది కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిపిఎం మురళీకృష్ణ, సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ పాల్గొన్నారు.

వీరవాసరం : గతంలో ఏ ప్రభుత్వం ఖర్చు పెట్టని విధంగా టిడిపి కూటమి ప్రభుత్వం ఒక్క పెన్షన్ పథకానికే రూ.2,500 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని ఎపి మహిళ సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత అన్నారు. సోమవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సుజాత పాల్గొన్నారు. ఇచ్చిన మాట అమలు చేయడం చంద్రబాబు నైజం అయితే మాట ఇచ్చి మోసం చేయడం జగన్‌రెడ్డి స్వభావం అంటూ సుజాత విమర్శించారు. ఇదేవిధంగా మండలంలో పలవురు కూటమి నాయకులు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తోలేరులో ఎంపిపి వీరవల్లి దుర్గాభవానిచంద్రశేఖర్, మత్స్యపురిలో చింతా

ఇరగవరంలో పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ

కనకయ్య, నందమూరు గరువులో రొంగల కృష్ణవేణి, వీరవాసరంలో సర్పంచి చికిలే మంగతాయారు, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, సొసైటీ ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, వేండ్ర దివాకర్, రాయపల్లి వెంకట్‌లు పాల్గొన్నారు.

ఇరగవరం : మండలంలోని ఏలేటిపాడు గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొని పంపిణీ చేశారు. టిడిపి మండల నాయకులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

ఆచంట : మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఉదయం నుండి సచివాలయ సిబ్బంది 7,953 పింఛన్లకు గాను 7,337 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం పింఛన్ లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈరోజు పింఛన్ తీసుకోలేకపోయిన వారికి మంగళవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

తణుకు: కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సమావేశం అల్లాడి నాగ బలరాం అధ్యక్షతన వేల్పూరులో స్థానిక పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వీరభద్రరావు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయంతో ప్రకటించిన 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకించవలసిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడానికి మరింత ఉత్సాహం చూపిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆయన విమర్శించారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని, సంక్షేమ బోర్డును కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లంకె దుర్గారావు, బొక్క బాలాజీ రావు, ఆనందం గంగాధర్‌రావు, వాసా వెంకట సుబ్బారావు, తిరునాదం వెంకటేశ్వరరావు, దొంతంశెట్టి ముకుందరావు, మల్లాడి మాధవకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి : జెడ్‌పిటిసి

ఆచంట: దళారులు వ్యాపారుల బారినపడి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. వల్లూరు సొసైటీ ఆధ్వర్యాన రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దళారుల మోసాల నుండి రక్షించడానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. జాప్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు తోట ఆదినారాయణ(తాతాజీ), వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు దేవల రమేష్, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏడిద వెంకటకృష్ణారావు, వ్యవసాయాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించినప్పుడే సాధికారిత సాధ్యం

శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కళ్యాణి

భీమవరం : మహిళలకు రక్షణ కల్పించినప్పుడే సాధికారిక సాధ్యం అవుతుందని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి అన్నారు. స్థానిక బ్రౌనింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మహిళా సాధికారత అంశంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన కళ్యాణి మాట్లాడుతూ మనదేశంలో మహిళల పాత్ర అతిముఖ్యంగా ఉందన్నారు. మహిళలు నింగి నుంచి నేల వరకు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. కానీ మన దేశంలో మహిళల స్థానం ఇంకా రెండు లోనే ఉందని, మహిళ సాధికారత మహిళలకి పూర్తిస్థాయిలో లభించలేదన్నారు. మహిళలకి పూర్తిస్థాయిలో హక్కులన్నీ లభించాలన్నారు. ఐద్వా టౌన్ కార్యదర్శి ఎండి.సరోజినీ మాట్లాడుతూ చట్టాలన్నీ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఐద్వా టౌన్ అధ్యక్షురాలు బి.వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ బి.సింధు, జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ టి.రేష్మ, ఎస్.జోషిని, పి.సాయికృష్ణ, ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్షుడు కె.రోహిత్ పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ.37 కోట్ల 70 లక్షలు విడుదల : కలెక్టర్

భీమవరం : జిల్లాలోని రోడ్ల అభివృద్ధికి, కోపల్లె బ్రిడ్జి నిర్మాణానికి రూ.37.70 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్ర రహదారులు పాలకొల్లు నియోజకవర్గంలో మేడపాడు వయా నరసాపురం మీదుగా చించినాడ వరకు 11.320 కి.మీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.70 కోట్లు, అలాగే నరసాపురం నియోజకవర్గంలోని మేడపాడు వయా నరసాపురం మీదుగా చించినాడ వరకు 11.320 కి.మీ నుండి 15.500 కి.మీ వరకు రూ.2.60 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి ఉండి నియోజకవర్గంలోని చింతలపాడు-మల్లవానితిప్ప రహదారి వెడల్పు, పటిష్ట పరచుటకు 0 కి.మీ నుండి 16 కి.మీ వరకు రూ.3.40 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విజయవాడ - విశాఖపట్నం రోడ్డు 106.030 కి.మీ నుండి 121.30 కి.మీ పరిధిలో రోడ్డు అభివృద్ధికి రూ.4.30 కోట్లు, కసాపెంటపాడు-గణపవరం రోడ్డు 0 కి.మీ నుండి 5.700 కి.మీ వరకు, 7.400 కి.మీ నుండి 8.000 కి.మీ వరకు రోడ్డు అభివృద్ధికి రూ.1.20 కోట్లు, ఆకుతీగలపాడు మీదగా వెళ్లే కె.పెంటపాడు-బోడపాడు రోడ్డు ఉపరితలం అభివృద్ధికి 0 కి.మీ నుండి 8 కి.మీ వరకు రూ.3.00 కోట్లు, పెదతాడపల్లి-వెంకట రామన్నగూడెం రోడ్డు ఉపరితలం అభివృద్ధికి 0 కి.మీ నుండి 8.900 కి.మీ వరకు రూ.3.60 కోట్లు విడుదల చేశారు. ఎల్.అగ్రహారం మీదుగా వెళ్లే ఆర్అండ్‌బి రహదారి-పుల్లయ్యగూడెం 0 కి.మీ నుండి 5.400 కిలోమీటర్ల వరకు రోడ్డు అభివృద్ధికి రూ.90 లక్షలు, తణుకు నియోజకవర్గంలో దువ్వ - ఆరుళ్ల రహదారి నిర్మాణానికి 2.220 కి.మీ నుండి 3.200 కి.మీ వరకు, 4.710 కి.మీ నుండి 7.500 కి.మీ వరకు రూ.400 లక్షలు, అలాగే ఉండి నియోజకవర్గంలో కోపల్లె బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మొగల్తూరు: మండల కేంద్రం మొగల్తూరులోని శ్రీనివాస హాస్పిటల్‌లో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నామని వైద్యులు సిహెచ్.శ్రీనివాసరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధా రామన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన నిర్వహించే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

ఎంపిడిఒగా ఎం.నాసరురెడ్డి బాధ్యతలు

నరసాపురం: నరసాపురం ఎంపిడిఒగా ఎం.నాసరురెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్లోని దొర్నకల్ మండల ఉప ఎంపిడిఒగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యాలయ పర్యవేక్షణాధికారి వికె.వీరభద్రరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నాసరురెడ్డిని ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్, ఎన్ఆర్‌జిఎస్ పిఒ వై.శ్రీనివాస్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

వాసవి పెనుగొండగా మార్పు : పితాని

పెనుగొండ: మండలంలోని పెనుగొండ పట్టణానికి చారిత్రక గౌరవం దక్కిందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో వివిధ సామాజిక తరగతులకు ఇచ్చిన ఎన్నిక హామీల్లో భాగంగా ప్రతి ఒక్కటి నిలబెట్టుకుంటూ, ఆర్యవైశ్యుల భావోద్వేగాలను గౌరవిస్తూ, కూటమి ప్రభుత్వం పెనుగొండ గ్రామాన్ని వాసవి పెనుగొండగా మారుస్తూ జిఒ నెం.1495 ప్రకారం ప్రకటించడం చరిత్రలో నిలిచిపోయే చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని తెలిపారు. సర్పంచి నక్క శ్యామల సోనీ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పెనుమంట్ర : అనారోగ్యంతో బాధపడి, వైద్య సేవలు పొందిన మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.8 లక్షల 58 వేల, 848 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. నియోజకవర్గ టిడిపి పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK MEER NABIUNNISA SULTHANABEGUM (Old Name) D/o SHAIK AKBAR BASHA R/o Door no 14-5-9, pension line, Near A R D G K school, Eluru, Andhra Pradesh, 534005 have changed my name to MOHAMMED NABIUNNISA (New Name). Hence forth I am being called as MOHAMMED NABIUNNISA for all purposes.
By mohammed nabiunnisa

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం గణపవరం గ్రామ కాపురస్తులైన పెరుమాళ్ళ దివ్య శ్రీ సాయి లలిత తండ్రి శ్రీనివాస్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ V1058231 గల్ల పాస్ పోర్ట్ గణపవరం గ్రామంలో జిరాక్స్ తీయించు కుని మా ఇంటికి గణపవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

పెరుమాళ్ళ దివ్య శ్రీ సాయి లలిత, తండ్రి శ్రీనివాస్, గణపవరం గ్రామం, గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్.9494705577

మహారాజశ్రీ విజయవాడ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి

OS No.1075/2024

Between:-
Bank of Baroda Gollapudi Branch, Vijayawada, Rep by it's Chief Manager ...Plaintiff

And

1) Panuganti Rajya Lakshmi W/o Ramesh, R/o. D.No.7-321/18, Road No.2, Krishna Vilas Colony, Nuzvid, Nuzvid Mandal, Krishna District-521201
2) Panuganti Ramesh, S/o Sambasiva Rao, R/o. D.No.7-321/18, Road No.2, Krishna Vilas Colony, Nuzvid, Nuzvid Mandal, Krishna District-521201.
..Defendants

పై నంబరు దావా వాది బ్యాంకువారు, మీపై దావా బాకీ రు 1,71,100-00ల్కు మరియు ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్న యెడల తెలుపకొనే నిమిత్తము ది.11-12-2025వ తేదిన ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయముగా గాని, లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలిజేయడమైనది.

విజయవాడ
28-11-2025

ఇట్లు
దాసు త్రివిక్రమవ్యాస్,
వాది బ్యాంకు తరపు న్యాయవాది,
స్వామి స్ట్రీట్, గాంధి నగరం, విజయవాడ-520003,
సెల్ నెం.62814 51118

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) AT VIZIANAGARAM
O.S. 715/2023

Between:
Valle Sankara Rao and another...Plaintiffs
And:
Valle Pydisetty and others ...Defendants
To
D-5 : Smt. Sunkari Rama Venkata Naga Devi Prasanthi, W/o Santosh Kumar, aged 36 years, Residing at D. No. 29-18, Guntiswari Street, Palakollu, West Godavari District.

NOTICE

Take notice that the plaintiffs filed the above suit under against the defendants for partition of the suit schedule properties which you are the 5th defendant and the said suit stands posted to 17-12-2025 for notice to you. If you got any objection in the above suit you can appear in person or through an advocate and file your objections if any on **17-12-2025 at 10-30 A.M** in the above Court. If failed to appear the honorable court will decide the matter as exparte.

L. SATYANARAYANA,
Advocate for the plaintiffs
VIZIANAGARAM-535002